సాక్షి కామారెడ్డి

మంగళవారం ‌। 31 ‌। డిసెంబర్ ‌। 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



అక్రమ రిజిస్ట్రేషన్లు..

పంచాయతీ ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని లింగంపేటవాసులు డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
30.6 /14.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
చలి తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఏఎస్పీగా చైతన్యరెడ్డి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఏఎస్పీ)గా ఐపీఎస్ అధికారి బొక్క చైతన్యరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. చైతన్యరెడ్డి వరంగల్ జిల్లాకు చెందిన వారు. వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. కొంతకాలం నీటిపారుదల శాఖలో ఏఈగా పనిచేసి, సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. మూడుసార్లు ప్రిలిమ్స్, రెండుసార్లు మెయిన్స్ వరకు వెళ్లిన చైతన్యరెడ్డి.. ఆరో ప్రయత్నంలో 161వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2022 బ్యాచ్‌కు చెందిన ఆమె గ్రేహౌండ్స్‌లో ఏఎస్పీగా పనిచేశారు. అక్కడినుంచి బదిలీపై కామారెడ్డి ఏఎస్పీగా వస్తున్నారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన నాగేశ్వర్‌రావ్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా గతంలో కామారెడ్డి పోలీస్ సబ్ డివిజనల్ అధికారిగా ఐపీఎస్ అధికారులు పనిచేసేవారు.

రేపటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ బుధవారం ప్రారంభం కానుంది. ఆహార భద్రత కార్డులపై ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. 15వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

డీఈఈ సెట్ వెబ్ ఆప్షన్లకు మరో అవకాశం

కామారెడ్డి అర్బన్: డీఈఈ సెట్ -2024 ప్రవేశాల కోసం తొలి, మలి విడతల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వని వారికి మరో అవకాశం కల్పించారు. జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి మరో అవకాశం కల్పించారని నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాచారెడ్డిలో చిరుత కలకలం

మాచారెడ్డి: ఘన్‌పూర్ శివారులోని అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందన్న ప్రచారంతో మండలవాసుల్లో ఆందోళన నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డికి చెందిన ఇద్దరు వ్యక్తులు సోమవారం సిరిసిల్ల నుంచి బైక్‌పై కామారెడ్డి వైపు వస్తున్నారు. ఘన్‌పూర్ శివారులో వారికి రోడ్డుపై చిరుత కనిపించింది. కొద్దిసేపు రోడ్డుపై అటూ ఇటూ తచ్చాడి అటవీ ప్రాంతంలోకి పరుగెత్తిందని వారు 'సాక్షి'తో తెలిపారు.

దిగివచ్చిన కూరగాయలు



నాగిరెడ్డిపేట: కూరగాయల ధరలు దిగివస్తున్నాయి. మొన్నటివరకు ఆకాశాన్నంటిన ధరలు.. ఇప్పుడు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో జరిగిన వారాంతపు సంతలో కిలో టమాటలను రూ. 10కి విక్రయించారు. వారం క్రితం రూ. 20 నుంచి రూ. 30 వరకు అమ్మారు. గతంలో కిలోకు రూ.80-రూ.100 వరకు పలికిన వంకాయ, కాలిఫ్లవర్, బీరకాయ, బెండకాయ, కాకర వంటి కూరగాయల ధరలు సైతం ఈ వారం తగ్గుముఖం పట్టాయి. ఆయా కూరగాయలు కిలోకు రూ.40-50లు పలికాయి.

పెరుగుతున్న నేర ప్రవృత్తి



- ఆగని హత్యలు, అత్యాచారాలు
- రక్తమోడిన రహదారులు
- పలువురు టీచర్లపై పోక్సో కేసులు
- 2024 నేర సమీక్షలో వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం : నేరాల నియంత్రణకు పోలీసు శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా నేరాలు మాత్రం తగ్గడం లేదు. ఏటా వివిధ కేసుల్లో పెరుగుదల కనిపిస్తోంది. హత్యలు, అత్యాచారాలు, మహిళా సంబంధిత నేరాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఎస్పీ సింధు శర్మ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి 2024 నేర సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలు..

మహిళా సంబంధిత నేరాలు..

మహిళలపై దాడులు, వరకట్నం, గృహహింస, అత్యాచారాలు లాంటి నేరాలు పెరిగాయి. ఇలాంటివి గతేడాది 361 నమోదుకాగా ఈసారి 510 కేసులు అయ్యాయి. వాటిలో 12 హత్యలు, 2 వరకట్న మరణాలు, 61 అత్యాచారం, 3 గృహహింస కారణంగా మరణాలు, 304 గృహహింస, 103 లైంగిక వేధింపులు, 25 కిడ్నాప్ కేసులున్నాయి. మహిళా సంబంధిత నేరాల కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపించడానికి ప్రధాన కారణం కోర్టు రిఫర్ కేసులు ఎక్కువగా వస్తుండటమేనని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ముందుగా పీఎస్‌లకు వచ్చే ఫిర్యాదుల్లో ఇరుపక్షాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత అవసరం అనిపిస్తేనే కేసు నమోదు చేస్తామన్నారు. కోర్టు రిఫర్ అయితే నేరుగా కేసు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కోర్టు రిఫర్ కేసులు వస్తుండడంతోనే ఈసారి ఇలాంటి 100 కేసులు ఎక్కువగా నమోదయ్యాయన్నారు. ఇలాంటి నేరాల నియంత్రణకు షీటీంల ద్వారా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పాఠశాలల్లో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కొందరు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయడంతో నాగిరెడ్డిపేట్, లింగంపేట్, గాంధారి, భిక్కనూరు, నిజాంసాగర్, నస్రుల్లాబాద్ పీఎస్‌ల పరిధిలో ఉపాధ్యాయులపై 6 పోక్సో కేసులు నమోదయ్యాయని వివరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ, పక్కన ఏఎస్పీ నర్సింహారెడ్డి

తగ్గని దొంగతనాలు..

దొంగతనాల కేసులు గతేడాది 709 నమోదు కాగా.. ఈ ఏడాది 708 కేసులయ్యాయి. పగటిపూట 17, రాత్రి వేళలో 191, చిన్నా చితకా చోరీలు 500 ఉన్నాయి. ఆస్తి సంబంధిత నేరాల్లో 65 శాతం కేసులను ఛేదించి 53 శాతం సొత్తు రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు.

టెక్నాలజీతో కేసుల పరిష్కారం

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఈ ఏడాది 500 కేసులను పరిష్కరించినట్లు ఎస్పీ తెలిపారు. వాటిలో సీసీ కెమెరాల ద్వారా 100 కేసులను ఛేదించామన్నారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా జిల్లావ్యాప్తంగా 58,798 మంది అనుమానితులను పరిశీలించి, వారిలో 293 మంది నేరస్తులను గుర్తించామన్నారు. సీఈఐఆర్ ద్వారా 1,388 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. డయల్ 100 కు 43,033 ఫిర్యాదులు వచ్చాయని, వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించడంతోపాటు 193 కేసులు నమోదుచేశామని ఎస్పీ తెలిపారు.

మొత్తం కేసులు 6,006

జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లలో కలిపి ఈ ఏడాది మొత్తం 6,006 కేసులు నమోదయ్యాయి. 2023 సంవత్సరంలో 5,578 కేసులు నమోదు కాగా.. ఈసారి 428 కేసులు ఎక్కువగా నమోదైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది 38 హత్య కేసులు నమోదయ్యాయి. ఇందులో కుటుంబ తగాదాల కారణంగా 10, వివాహేతర సంబంధాలతో 6, ఆస్తి తగాదాల నేపథ్యంలో 4, భూ తగాదాలతో 2, పాత కక్షలు, ప్రేమ వ్యవహారాల కారణంగా ఒకటి చొప్పున, ఇతర కారణాలతో మరికొన్ని హత్యలు జరిగాయి.


తగ్గిన సైబర్ నేరాల సంఖ్య

జిల్లాలో గతేడాది 246 సైబర్ కేసులు నమోదవగా ఈసారి 205కు తగ్గాయి. ఈ ఏడాది సైబర్ కేసుల్లో డబ్బులు పోగొట్టుకున్న మొత్తంలో నుంచి 279 మంది బాధితులకు సంబంధించిన రూ. 33,14,895 లను రికవరీ చేసి కోర్టుల ద్వారా అప్పగించామని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం కోసం ప్రతినెల మొదటి బుధవారం అన్ని పీఎస్‌ల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ ఏడాది జిల్లాలో జరిగిన ప్రధాన సంఘటనలు

- ఈనెల 25న అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పీఎస్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ శ్రుతి, సహకార బ్యాంకు కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మృతదేహాలు లభించాయి. ఈ ఘటన మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. మృతి చెందిన ముగ్గురి మధ్య ఏం జరిగి ఉంటుందో ఇప్పటికీ మిస్టరీగానే ఉంది.
- లింగ నిర్ధారణ చేస్తున్న ముఠాను కామారెడ్డి పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేసిన ఘటన కామారెడ్డిలో అక్టోబర్ 26 న వెలుగు చూసింది. ఈ కేసులో కారులో తరలిస్తున్న లింగ నిర్ధారణ చేసే 2 స్కానింగ్ యంత్రాలు పట్టుకుని బాధ్యులైన ఓ మెడికల్ ఆఫీసర్, ఆయన తండ్రితోపాటు మరొకరిని అరెస్టు చేయడం చర్చనీయాంశమైంది.
- నవజాత శిశువును విక్రయించినట్లు తేలడంతో కామారెడ్డిలోని సమన్విత ఆస్పత్రిపై పోలీసులు, వైద్యశాఖ అధికారులు జూలై 9 న కేసు నమోదు చేశారు. మరుసటి రోజు అధికారులు ఆస్పత్రిని సీజ్ చేసి బాధ్యులైన వైద్యులను అరెస్ట్ చేశారు.
- నవంబర్ 14 న ఏసీబీ దాడి చేయగా లింగంపేట ఎస్సై అరుణ్, స్టేషన్ రైటర్ రామస్వామి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. స్టేషన్ బెయిల్‌కు ఓ వ్యక్తి నుంచి రూ.10 తీసుకుంటూ పట్టుబడటం పోలీస్ శాఖలో చర్చనీయాంశమైంది.
- జనవరి 8 న కామారెడ్డిలోని సబ్‌స్టేషన్ వద్దనున్న కార్యాలయంలో పని చేసే ఏఈ రాజు 12,500 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- కామారెడ్డి డీఎంహెచ్‌వోగా పనిచేసిన లక్ష్మణ్ సింగ్‌పై సొంత శాఖ ఉద్యోగులు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన ఘటన మే 14 న వెలుగులోకి వచ్చింది. ఆ వ్యవహారంలో అతడిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో 258 మంది మృతి



2023లో 501 రోడ్డు ప్రమాదాలు జరగ్గా వాటిలో 230 మంది చనిపోయారు. 271 మంది గాయపడ్డారు. ఈ ఏడాది 513 ప్రమాదాలు జరిగి 258 మంది మృతి చెందగా 255 మంది గాయాలపాలయ్యారు. బాన్సువాడ, నస్రుల్లాబాద్‌ల మధ్య 20 కిలోమీటర్ల మేర రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు. ఈ ప్రాంతంలో గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది చనిపోగా ఈ ఏడాది 20 మంది మృత్యువాత పడ్డారన్నారు. ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

ఇందిరమ్మ సర్వేను పక్కాగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సర్వేలో వెనకబడిన మండలాల ప్రత్యేక అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేను వేగవంతం చేయాలన్నారు. సర్వే చేస్తున్న వారి పనితీరును మెరుగు పరచాలని సూచించారు. అందుకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సర్వే నెమ్మదిగా జరుగుతున్న ప్రాంతాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కామారెడ్డి, బిచ్కుంద, నాగిరెడ్డిపేట్, నస్రుల్లాబాద్, పిట్లం, జుక్కల్, రామారెడ్డి, భిక్కనూరు మండలాల్లో సర్వే నెమ్మదిగా సాగుతోందన్నారు. ఆయా ప్రాంతాలలో వేగం పెంచాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, డీపీవో తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

- ఒకరిని కాపాడబోయి మిగతావారు నీటమునిగి మరణించి ఉండొచ్చు
- ఎస్సై, కానిస్టేబుల్, ఆపరేటర్‌ల మృతి కేసుపై ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: జిల్లాలో సంచలనం సృష్టించిన ముగ్గురి మృతి కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడారు. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పీఎస్ కానిస్టేబుల్ శ్రుతి, సహకార బ్యాంకు కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్‌ల మృతి కేసుపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. ముందుగా దూకిన ఒకరిని కాపాడబోయే ప్రయత్నంలో మిగతా ఇద్దరు కూడా నీట మునిగి చనిపోయి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి అంటూ ఎవరూ లేకపోవడంతో సంఘటన జరిగిన సమయంలో అక్కడ ఏం జరిగింది అనే దానిపై స్పష్టత రాలేదన్నారు. వారు నీట మునిగిన ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉంటుందన్నారు. ఈత రాని వారు అందులో పడితే బయటకు రావడం సాధ్యం కాదన్నారు. ప్రమాదవశాత్తు జరిగిందా, ఆత్మహత్యలా అనేది తెలియడం లేదన్నారు. మృతుల సెల్‌ఫోన్‌లు, నీటి నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామన్నారు. నివేదిక రావాల్సి ఉందని, సాంకేతిక అంశాల ఆధారంగా పరిశోధన చేస్తున్నామని తెలిపారు. మృతిచెందిన ఎస్సై సాయికుమార్‌పై గతంలో ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు.

పాలనలో ఎన్నో మార్పులు

- కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ రాక
- బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా కిరణ్మయి నియామకం
- కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరు అమలు
- సజావుగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ



జూమ్ ద్వారా ప్రజావాణి నుంచి మండల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

రివైండ్ 2024


సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా పాలనలో ఏడాది కాలంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన జితేష్ వి పాటిల్ భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో నిర్మల్ నుంచి ఆశిష్ సంగ్వాన్ వచ్చారు. కొత్త కలెక్టర్ పరిపాలనలో అనేక మార్పులు తీసుకువచ్చి తనదైన మార్క్ చూపిస్తున్నారు. ప్రభుత్వం బాన్సువాడ రెవెన్యూ డివిజన్ హోదా పెంచి, సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కిరణ్మయిని నియమించింది. ఆమె నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పనిచేసిన చంద్రమోహన్.. రోడ్లు భవనాల శాఖ మంత్రి పీఎస్‌గా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వి.విక్టర్ వచ్చారు. జిల్లా పాలనలో ఏడాది కాలంలో జరిగిన మార్పులపై కథనం..

- కలెక్టరేట్‌లో ఉద్యోగుల సమయపాలనపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టి సారించారు. అధికారులు, ఉద్యోగుల హాజరుకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేశారు. రెండు బయోమెట్రిక్ యూనిట్లను ఏర్పాటు చేశారు. దీంతో ఉద్యోగులు సమయపాలన పాటించడంలో మార్పు కనిపిస్తోంది.
- ప్రజావాణిలో అనేక మార్పులు జరిగాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు తప్పనిసరిగా హాజరవుతున్నారు. దీంతో జిల్లా స్థాయి అధికారులు ప్రజావాణిలో భాగస్వాములవుతున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి ప్రజావాణి నుంచి జూమ్ ద్వారా మండల అధికారులతో మాట్లాడి వాటికి పరిష్కారాలు వెతుకుతున్నారు.
- అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి. దీంతో ఆయా శాఖల్లో అధికారులు, సిబ్బంది చాలా మంది మారారు. డీఆర్‌డీవోగా సురేందర్, జిల్లా సంక్షేమ అధికారిగా ప్రమీల, జిల్లా వ్యవసాయాధికారిగా తిరుమల ప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారిగా జ్యోతి తదితరులు వచ్చారు. దాదాపు ప్రధాన శాఖలకు రెగ్యులర్ అధికారులు వచ్చారు. జిల్లా బీసీ సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, జిల్లా వైద్యాధికారి స్థానాలలో ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు.



కిరణ్మయి, సబ్ కలెక్టర్, బాన్సువాడ

- ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలతో పాటు నియామకాలు జరిగాయి. 910 మంది టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా, గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతి పొందారు. 1,130 మంది టీచర్లు బదిలీ అయ్యారు. డీఎస్సీ ద్వారా 454 మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చారు. అలాగే 78 పీఈటీ పోస్టులు ఫిజికల్ డైరెక్టర్‌గా అప్‌గ్రేడ్ అయ్యాయి. తెలుగు లాంగ్వేజ్ పండిట్ పోస్టులు 193, హిందీ పోస్టులు 180, ఉర్దూ ఐదు, మరాఠీ రెండు పోస్టులు ఎస్ఏ పోస్టులుగా అప్‌గ్రేడ్ అయ్యాయి.



వి.విక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

- మండల విద్యాశాఖ అధికారులుగా ఆయా మండలాల్లో పనిచేస్తున్న సీనియర్ గెజిటెడ్ హెడ్మాస్టర్లను నియమించారు. దీంతో ఎంఈవోల కొరత తీరింది.
- సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీలలో ఒకే రకమైన డైట్ అమలు చేయడానికి ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచింది. అలాగే కాస్మెటిక్ చార్జీలను కూడా పెంచింది.
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌజ్ లిస్టింగ్ చేశారు. జిల్లాలో 3.27 లక్షల కుటుంబాలు ఉన్నట్లు లెక్క తేల్చారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.
- ప్రభుత్వం రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయగా అందులో జిల్లాలోని 1,01,416 మంది రైతులకు ప్రయోజనం కలిగింది. రూ. 758.57 కోట్లు మాఫీ అయ్యాయి. రుణమాఫీ పొందిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా, మాఫీ కాని రైతులు నిరాశలో ఉన్నారు.
- జిల్లాలో కొత్తగా తొమ్మిది పంచాయతీలు ఏర్పాటయ్యాయి. దీంతో పంచాయతీల సంఖ్య 535 కు చేరింది.
- కొత్త మండలాల్లో మండల పరిషత్‌ల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గతంలో తహసీల్ కార్యాలయం మాత్రమే ఉండేది. పాల్వంచ, డోంగ్లీ, మహ్మద్‌నగర్ మండలాల్లో మండల పరిషత్‌లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే ఆయా మండలాలకు వ్యవసాయ శాఖ, విద్యాశాఖ అధికారులను నియమించారు.
- గృహనిర్మాణ శాఖను బలోపేతం చేస్తూ ప్రభుత్వం జిల్లాలకు ప్రాజెక్టు డైరెక్టర్లను నియమించింది. అందులో భాగంగా కామారెడ్డి ప్రాజెక్టు డైరెక్టర్‌గా విజయపాల్‌రెడ్డి నియమితులయ్యారు.

ఏ బ్యాగులో ఏముందో...?!



ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తో చెప్పుకోవడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి తరలి వస్తుంటారు. అయితే గత వారం ఎవరో పురుగుల మందు డబ్బాతో వచ్చారన్న ప్రచారంతో పోలీసులు నానా హైరానా పడ్డారు. ఈ వారం అప్రమత్తమైన పోలీసులు.. ప్రజావాణి ప్రారంభం కాకముందే కార్యాలయం గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. కార్యాలయానికి వచ్చిన వారి బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

'బాన్సువాడపై కేసీఆర్‌తో చర్చిస్తా'

బాన్సువాడ : బాన్సువాడలో బీఆర్ఎస్ నాయకత్వం విషయమై పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చిస్తానని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ఏ నాయకుడికి ఇవ్వని ప్రాధాన్యత, గౌరవం పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు బాన్సువాడకే ఎక్కువ మంజూరు చేశారన్నారు. కానీ కష్టకాలంలో పార్టీని కాపాడతారని అనుకుంటే ఆయన మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. త్వరలో బాన్సువాడకు వస్తానన్నారు. కార్యకర్తలు ఎవరికీ భయపడవద్దని, అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో బాన్సువాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ జుబేర్, నాయకులు గణేశ్, సాయిబాబా, రమేశ్ యాదవ్, మహేశ్, శివ, సాయిలు, సద్దాం, చందు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో బాన్సువాడ బీఆర్ఎస్ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

క్లుప్తంగా

తీసుకున్న అప్పు నెల రోజుల్లో చెల్లించాలి

ఎల్లారెడ్డి: తీసుకున్న అప్పును నెల రోజుల్లో చెల్లించాలని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక సోమవారం తీర్పు ఇచ్చినట్లు న్యాయవాది నామ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు.. రాఘవపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి వద్ద అదే గ్రామానికి చెందిన దుర్గయ్య 2016లో అప్పుగా రూ.లక్షా 50 వేలు తీసుకున్నారు. దీనికి జమానతుగా చెక్‌ను గోపాల్‌రెడ్డికి ఇవ్వగా నెల రోజుల అనంతరం గోపాల్‌రెడ్డి, బ్యాంకులో చెక్ వేయగా ఖాతాలో డబ్బులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం న్యాయమూర్తి హారిక ముందుకు రాగా.. దుర్గయ్య తాను తీసుకున్న అప్పును గోపాల్‌రెడ్డికి నెల రోజుల్లోగా చెల్లించాలని లేని పక్షంలో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని తీర్పు ఇచ్చినట్లు న్యాయవాది తెలిపారు.

లా విభాగంలో ఇద్దరికి డాక్టరేట్


శ్రీనివాస్


రతన్‌సింగ్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూ నివర్సిటీ న్యాయ విభాగం పరిశోధక విద్యార్థులు సభావత్ శ్రీనివాస్, రతన్ సింగ్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ ప్రసన్నరాణి పర్యవేక్షణలో 'భారతదేశంలోని మహిళలకు నివా స స్థల హక్కులు' అనే అంశంపై శ్రీనివాస్ పరిశోధన పూర్తి చేశాడు. 'అత్యవసరాల పరిస్థితిలో సినిమా నిర్మాణం- సినిమాల హక్కులు' అనే అంశంపై రతన్‌సింగ్ పరిశోధన చేశాడు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 78 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 78 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. లేదంటే పరిష్కార మార్గాలు చూపాలన్నారు. అంతేగానీ పెండింగ్‌లో పెట్టకూడదని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జెడ్పీ సీఈవో చందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో రెండు ఫిర్యాదులు

ఎల్లారెడ్డి: స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు నాయబ్ తహసీల్దార్ చరణ్‌సింగ్ తెలిపారు. వివరాలను జిల్లా అదనపు కలెక్టర్‌కు వీసీ ద్వారా తెలియజేసినట్లు ఆయన చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులున్నారు.


దివ్యాంగుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సర్వే త్వరగా చేపట్టాలి

రాజంపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించినట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం రాజంపేట తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు. రాజంపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ళ సర్వే 88 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. ఎంఈవో పూర్ణచంద్రరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ రహిమొద్దీన్ అన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఏవో నర్సింలు, ఏపీఎం మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

దారి లేకుండా చేశారు



తమ పంట పొలాలకు వెళ్లే దారిని ఓ వ్యక్తి కబ్జా చేస్తున్నాడని ఆరోపిస్తూ రాజంపేటకు చెందిన పలువురు రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు-648లో ముందు భాగంలో భూమిని ఇటీవల ఓ వ్యక్తి కొనుగోలు చేశారని, వెనుక భాగంలో భూములున్న 25 మంది రైతులకు దారి ఇవ్వకుండా మూసివేస్తున్నారని రైతులు వాపోయారు. తగిన చర్యలు తీసుకుని దారి కల్పించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.

రుణమాఫీ రాలేదు..



బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ గ్రామానికి చెందిన అనేక మంది రైతులకు రుణమాఫీ రాలేదని కామారెడ్డి మున్సిపాలిటీ వడ్లూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రజావాణికి తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో గ్రామానికి చెందిన వందల మంది రైతులు గతంలో పంట రుణాలు తీసుకున్నారని తెలిపారు. వారిలో చాలా మంది రైతులకు రుణమాఫీ రాలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

బిచ్కుంద(జుక్కల్): ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కారానికి మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. సోమవారం బిచ్కుందలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జుక్కల్ నియోజకవర్గ ప్రజలు వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు పెట్టుకున్నారు. సబ్ కలెక్టర్ ప్రజల సమస్యలు ఓపికతో విన్నారు.. వారి వినతులు స్వీకరించి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలకు భరోసా కల్పించారు. 60కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు స్వీకరించిన వినతులపై సత్వరంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి నెలా బిచ్కుందలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడానికి ఆలోచిస్తున్నామని అన్నారు. ఈ విషయం గురించి కలెక్టర్ దగ్గర చర్చిస్తానని అన్నారు. తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో గోపాల్, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

సమయానికి రారు.. ఫిర్యాదులు స్వీకరించరు

- బీబీపేటలో ప్రజావాణికి అధికారులు డుమ్మా
- వచ్చిన అధికారులు సైతం సమయపాలన పాటించని వైనం
- సంబంధిత అధికారులు లేకపోవడంతో కలెక్టరేట్‌కు వెళ్తున్న ఫిర్యాదుదారులు

బీబీపేట: అందరికీ అధికారులు అందుబాటులో ఉండేలా ప్రతి మండలంలో ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించేలా జూన్ నెల నుంచి ప్రభుత్వం ఒకపక్క చర్యలు తీసుకుంటుంటే అధికారులు మాత్రం ప్రజావాణి కార్యక్రమానికి రాకుండా మొద్దు నిద్రపోతున్నారు. వచ్చిన అధికారులు సైతం వారికి నచ్చిన సమయానికి వస్తున్న ఘటన బీబీపేటలో జరుగుతోంది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు దీనిపై చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. బీబీపేటలో అన్ని శాఖల అధికారులు ఉండకపోవడంతో ప్రజలు ప్రజావాణి ఫిర్యాదుల కోసం కామారెడ్డి కలెక్టరేట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

డుమ్మా కొడుతున్న పలువురు అధికారులు..

ప్రతి ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరు హాజరు కావాల్సి ఉంటుంది. ఇక్కడే అన్ని శాఖల అధికారులు ఉండి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి. కానీ అన్ని శాఖల అధికారులు ఏ ఒక్క రోజు కూడా హాజరైన దాఖలాలు లేవు. ఈ డిసెంబర్ 2న ప్రజావాణిలో కేవలం నలుగురు అధికారులు, 9న ఏడుగురు, 16న ఏడుగురు, 23న ఐదుగురు అధికారులు, సోమవారం ప్రజావాణిలో కేవలం ఆరుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంఈవో అశోక్, ఎక్సైజ్ శాఖ నుంచి కానిస్టేబుల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎంపీవో అబ్బాగౌడ్‌లు మాత్రమే హాజరయ్యారు. వ్యవసాయ, ఆరోగ్య, వెటర్నరీ, ఇరిగేషన్, ఐకేపీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు ఉన్నప్పటికీ వారి కింది స్థాయి సిబ్బందిని పంపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పలుమార్లు అధికారులను రావాలని పిలిచినప్పటికీ రావడం లేదని తహసీల్దార్ సత్యనారాయణ సైతం చెబుతున్నారు.


ఉదయం 10:35 గంటలకు మొదటగా హాజరైన ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్

మట్టిలో మాణిక్యాలు గ్రామీణ క్రీడాకారులు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలుగా రాణిస్తారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. యువతి, యువకుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. సోమవారం జుక్కల్ మండలం పెద్దఎడ్గి గ్రామంలో ఎలమాస సందర్భంగా మల్లయోధుల కుస్తీ పోటీలను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుస్తీ పోటీల్లో క్రీడాకారులు రాణించి జుక్కల్ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నగదు, వెండి కడియాలను బహూకరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేశ్ దేశాయ్, శివానంద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


కుస్తీపోటీలను తిలకిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే

'ఏకీకృత పెన్షన్ విధానాన్ని ప్రతిఘటించాలి'



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని ప్రతి ఉద్యోగి ప్రతిఘటించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో సీపీఎస్ ఉద్యోగుల గొంతు వినిపించాలంటే టీఎస్‌సీపీఎస్‌ఈయూ మద్దతు ఇస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఇన్నారెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ప్రధానకారదర్శి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర సాహిత్య కమిటీ సభ్యులు మధు, విజయవర్ధన్, ఉపాధ్యక్షులు మోహన్, బాల్‌సింగ్, ప్రతినిధులు చంద్రశేఖర్, సురేష్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

- పట్టభద్రుల ఓటర్లు 368095
- ఉపాధ్యాయ ఓటర్లు 28240

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సి సుదర్శన్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యాక జాబితా విడుదల చేసినట్లు ప్రకటించారు.

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 499 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. మొదట పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది కాగా ఇందులో పురుషులు 2,18,060 మంది, మహిళా ఓటర్లు 1,23,250 మంది, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారు. తుది జాబితా విడుదల సమయానికి కొత్తగా 26,782 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 16,507 మంది, మహిళలు 10,273 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నారు.
- మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు మొత్తం 274 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. మొదట ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది నమోదు కాగా, ఇందులో పురుషులు 16,364 మంది, మహిళలు 9,557 మంది ఉన్నారు. తుది జాబితా విడుదల సమయానికి కొత్తగా 2,319 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 1,258 మంది, మహిళలు 1,061 మంది ఉన్నారు.

ఏపీకే ఫైల్‌తో రూ.1.25 లక్షలు మాయం

కామారెడ్డి రూరల్: ఏపీకే ఫైల్ పంపి అకౌంట్‌లో నుంచి డబ్బులు మాయం చేసిన ఘటన కామారెడ్డిలోని దేవునిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెట్కూరి రవికి రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. మాటల్లో పెట్టి ఏపీకే ఫైల్ పంపాడు. దాన్ని క్లిక్ చేయడంతో ఫోన్ మొత్తం సదరు వ్యక్తి చేతిలోకి వెళ్లిపోయింది. అనంతరం రవి అకౌంట్‌లోని రూ.50 వేలు ఖాళీ చేశాడు. అంతటితో ఆగకుండా రవి పేరిట రూ.75 వేలు లోన్ తీసుకున్నాడు.

క్రైం కార్నర్

బాల్కొండలో అగ్ని ప్రమాదం



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని నడిమిగల్లిలో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. కాలనీకి చెందిన పల్లికొండ చిన్న నర్సయ్య ఇంట్లో ఉదయం దేవుడి ఫొటోల వద్ద దీపం వెలిగించారు. అనంతరం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. దీపంతో పెంకుటిల్లు కట్టెలకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో మంటలు అదుపు చేశారు. అప్పటికే మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

కారు దగ్ధం



సిరికొండ: మండలంలోని చిన్న వాల్గోట్ గ్రామంలో కారు దగ్ధమైంది. గ్రామానికి చెందిన చెరుకుపల్లి ఆదర్శ్‌రెడ్డి తన కారును తన ఇంటి ఆవరణలో నిలిపి ఉంచాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు విద్యుత్ ప్రసారంలో అంతరాయం ఏర్పడినపుడు కరెంట్ మీటర్ వద్ద మంటలు చెలరేగి కారుపై పడ్డాయని బాధితుడు తెలిపారు. కారుకు అంటుకున్న మంటలు ఇంటి తలుపులు, కిటికీలకు వ్యాపించాయి. స్థానికులు మంటలను ఆర్పి వేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకెన్ డ్రైవ్ కేసులో జడ్జి ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ సోమవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామన్నారు. అందులో వల్లపు శ్రీనివాస్‌కు ఒకరోజు, నాగులపల్లి శంకర్‌కు రెండు రోజుల జైలు శిక్షను జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జన్ విధించారని పేర్కొన్నారు. 25 మందికి జరిమానా విధించినట్లు చెప్పారు.

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరికి..

నిజామాబాద్ రూరల్: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. ఈ నెల 28న తనిఖీలు నిర్వహించగా ఆర్మూర్‌కు చెందిన కిరణ్‌కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికాడన్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా రెండు రోజుల జైలు శిక్ష వేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రికార్డు అసిస్టెంట్ మృతి



మాచారెడ్డి: మాచారెడ్డి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాయినీ నవీన్(32) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన నవీన్ కొంతకాలంగా రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి కామారెడ్డి వైపు నుంచి మాచారెడ్డి వస్తుండగా పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొని గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్, అంబం గ్రామ శివారులోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైర్ చోరీ చేశారు. దాని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. సంబంధిత రైతులు ఎడపల్లి ఎస్సై వంశీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సంవత్సరంలో మండలంలో సుమారు 40 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయ్యాయి. వరినాట్ల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

ఖలీల్‌వాడి: నిర్మల్ జిల్లాకు చెందిన వాగేవార్ గౌతమ్(27)పై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 17న భర్తతో గొడవపడి నిర్మల్‌కు వచ్చిన ఓ మహిళను సాయం చేస్తానని నమ్మించి గౌతమ్ నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. ఓ లాడ్జిలో ఆమెకు ఇష్టం లేకుండా శారీరకంగా వాడుకొని, నిర్మల్‌లో వదిలేశాడు. స్పృహ తప్పి పడి ఉన్న ఆమెను గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసి నిజామాబాద్ ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

రెచ్చిపోయిన దొంగలు

- నందిపేట్‌లో ఐదు ఇళ్లలో చోరీ
- బాల్కొండలో రెండు తులాల బంగారం అపహరణ

నందిపేట్: నందిపేట్‌లోని రామ్‌నగర్ కాలనీలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఐదు ఇళ్లలోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు.. కాలనీలోని జూడా చర్చ్ సమీపంలో గల ఇసుక కొండయ్య, మేక వెంకటేశ్, పేదూరి భూమేశ్వర్, వీఆర్‌వో రాజేశ్వర్, బైండ్ల నారాయణ కుటుంబ సభ్యులు ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు వారి ఇళ్లలోకి చొరబడ్డారు. ఇసుక కొండయ్య ఇంట్లో 3 తులాల బంగారం, రూ.6 వేల నగదు పోయింది. మిగతా నాలుగు ఇళ్లలో ఏమీ దొరకకపోవడంతో వస్తువులను చిందరవందరగా పడవేసి వెళ్లిపోయారు. దొంగల కదలికలు సీసీ ఫుటేజీల్లో నమోదయ్యాయి. ఒకే సమయంలో రెండు బ్యాచ్‌లుగా దొంగతనం చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీం సభ్యులు ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం అర్ధరాత్రి కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు బాదారని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పామన్నారు.


నందిపేట్‌లో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

బాల్కొండలో..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దొంగలు రెండు తులాల బంగారం, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన పాగిరి చిన్న మల్లేశ్ బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లాడు. భార్య సవిత పిల్లలతో కలిసి ఇంట్లో ఉంటుంది. ఆమె రెండు రోజుల క్రితం ముప్కాల్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం చోరీ చేశారు. బాల్కొండ ఎస్సై నరేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా


బోల్తా పడిన ఆటో


మినీ వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు

- సడెన్ బ్రేక్ వేసిన లారీ డ్రైవర్
- ఒకదానికి ఒకటి ఢీకొన్న ఐదు వాహనాలు

ఆర్మూర్‌టౌన్: ముందు వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో లారీ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగా వెనకాల వస్తున్న వాహనాలు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళా ప్రాంగణం సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. నిర్మల్ వైపు నుంచి ఆర్మూర్ వస్తున్న ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. వెనుక వస్తున్న లారీ డ్రైవర్ ఆటోను ఢీకొట్టకుండా ఒక్కసారి బ్రేక్ వేయడంతో వెనుకలే ఉన్న టాటా ఏస్, రెండు కార్లు, వ్యాన్ ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు ఢీకొనడంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రి హత్య

రుద్రూర్: మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని ఓ కుమారుడు తన తండ్రిని హత్య చేశాడు. ఈ ఘటన రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ హైమద్(65)కు కుమారుడు మహబూబ్ అలియాస్ బబ్లూ ఉన్నాడు. హైమద్ భార్య ఇటీవల మృతి చెందడంతో ఇంట్లో తండ్రి కొడుకులే ఉండేవారు. మద్యానికి బానిసైన మహబుబ్ తాగడానికి డబ్బులు కావాలని తరుచు హైమద్‌తో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి డబ్బుల విషయమై ఘర్షణ జరిగింది. స్థానికులు జోక్యం చేసుకుని ఇద్దరికి సర్ది చెప్పారు. అర్ధరాత్రి మళ్లీ మహబూబ్ తండ్రితో గొడవ పడి ముఖం, ఛాతీపై కొట్టాడు. దీంతో హైమద్ మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రుద్రూర్ సీఐ కృష్ణ కుమార్, ఎస్సై సాయన్న వివరాలు సేకరించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

రాజంపేట: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేట మండలం ఆరెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొమ్ము నర్సింలు(37) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. అప్పుల బాధతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సుమలత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

జీవితంపై విరక్తితో..


పురుషోత్తం(ఫైల్)

బాన్సువాడ: బాన్సువాడకు చెందిన పురుషోత్తం (40) జీవితంపై విరక్తి చెంది సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాదిగా భార్య వేరుగా ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనస్తాపంతో మరొకరు..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం లోకల్ వెల్మల్ గ్రామానికి చెందిన సుంకరి పోశెట్టి(43) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాలు.. పాత సామాను ఏరుకొని జీవనం సాగించే పోశెట్టి భార్య నాలుగేళ్ల క్రితం చనిపోయింది. దీంతో బాల్కొండకు చెందిన నక్క పోసానితో సహజీవనం చేస్తున్నాడు. ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పోసాని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన పోశెట్టి దులానికి ఉరి వేసుకున్నాడు. మృతుడి కూతురు ఎర్రొల్ల సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత



భిక్కనూరు: అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను భిక్కనూరు టోల్ ప్లాజా సిబ్బంది, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. టోల్‌ప్లాజా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఛత్తీస్‌ఘడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను ఆపకుండా డ్రైవర్ బారికేడ్లను ఢీకొట్టి వెళ్లాడు. ఆ సమయంలో వ్యాన్‌లో ఉన్న పశువులు అరవడంతో టోల్‌గేట్ సిబ్బంది నీల రఘుతో పాటు మరో ముగ్గురు రెండు బైక్‌లపై వ్యాన్‌ను వెంబడించారు. పోలీసులు కూడా పెట్రోలింగ్ వాహనంలో వెంబడించారు. విషయం తెలుసుకున్న శ్రీసిద్దరామేశ్వరనగర్, బస్వాపూర్‌కు చెందిన యువకులు జాతీయ రహదారిపైకి వచ్చి సదరు వాహనాన్ని నిలిపేందుకు యత్నించినప్పటికి డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. వెనకాల పోలీసులు, టోల్‌గేట్ సిబ్బంది వెంబడిస్తుండటంతో భయపడి మెదక్ జిల్లా నర్సింగ్ వద్ద వ్యాన్‌ను నిలిపి పారిపోయాడు. వ్యాన్‌లో రెండు వైపుల బియ్యం రవాణా చేస్తున్నట్లు బస్తాలను పెట్టి మధ్యలో పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్‌ను భిక్కనూరు మండలం జగంపల్లిలోని గోశాల వద్దకు తీసుకెళ్లారు. అందులో 14 ఆవులు, 20 ఎద్దులు, ఒక లేగదూడ ఉండగా గోశాలకు అప్పగించారు. అనంతరం వ్యాన్‌ను భిక్కనూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని పెద్ద బజార్‌లో గల ఏటీఎంలో సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించినట్లు ఎస్సై యాసీన్ ఆరాఫత్ తెలిపారు. ఏటీఎంను పగులగొట్టడానికి యత్నించగా శబ్దం రావడంతో స్థానికుడు కేకలు వేశాడు. దీంతో దొంగ పరారయ్యాడు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: చోరీ కేసులో నగరంలోని కోటగల్లీకి చెందిన ఎలిగేటి నాగరాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఈ నెల 28న కోటగల్లీలోని శిరీష ఇంట్లోకి చొరబడి నాగరాజు రూ.10వేలు, సిలిండర్ చోరీ చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని నగదు, సిలిండర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.